క్లుప్తంగా

అర్హులకు జననీ సురక్ష పథకం అమలు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: అర్హులైన వారందరికీ ప్రభుత్వం అందిస్తున్న జననీ సురక్ష యోజన పథకాన్ని వర్తింప చేయాలని ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు అన్నారు. గర్భిణుల ఆధార్, బ్యాంకు ఖాతాల నంబర్లు తేడాలుంటే వాటిని సరిచేయాలని వైద్య సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సూచించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్‌కార్డు నమోదు విషయంలో ఎటువంటి ఆధారాలు లేకపోయినా నిర్దేశించిన నమూనాలో వాటిని నమోదు చేయాలన్నారు. ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

కాఫీ లైజన్ వర్కర్ మృతికి సంతాపం

గూడెంకొత్తవీధి: గుండెపోటుతో గురువారం ఉదయం గాలికొండ పంచాయతీ కాఫీ లైజన్ వర్కర్ వంతల చంద్రరావు(38) మరణించారు. ఉదయం ఇంటి వద్ద ఉన్న సమయంలో చంద్రరావు అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు సప్పర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుండెపోటుకు గురై మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఇతని మృతికి మండల అధికారులు, కాఫీ విభాగ అధికారులు తదితరులు సంతాపం తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

పెదబయలు: మండల కేంద్రంలోని ఏపీ గురుకుల రెసిడెన్సియల్ కళాశాల(బాలూరు)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.రామనాయక్ తెలిపారు. 2023–2024 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రవేశానికి గాను 10వ తరగతి ఉత్తీర్ణత సాధించాలన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, ఎంఎల్‌టీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ఈ నెల 12 నుంచి 31 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



అదుపు తప్పి రోడ్డు దిగువకు దూసుకుపోయిన క్వారీ లారీ

రాజవొమ్మంగి: నేషనల్ హైవే పనుల్లో భాగంగా మట్టి లోడింగ్ కోసం వెళ్తున్న ఖాళీ క్వారీ లారీ మండలంలోని నెల్లిమెట్ల సమీపంలో గురువారం అదుపుతప్పి రోడ్డు దిగువకు దూసుకుపోయి ఓ చెట్టును ఢీకొట్టి ఆగింది. ఆ సమయంలో ఎదురుగా ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. చెట్టును ఢీకొట్టడంతో లారీ ఎదుట భాగం నుజ్జునుజ్జు అయ్యింది. డ్రైవర్ ఈ ప్రమాదం నుంచి చాకచక్యంగా తప్పించుకొన్నారు.

చిన్నారులకు ఆటల పోటీలు



స్పూన్ ఆటలు ఆడుతున్న బాలలు

డుంబ్రిగుడ: మండలంలోని శాఖ గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించినట్టు గ్రంథాలయాధికారి సునీత చెప్పారు. విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

మోతుగూడెం: పొల్లూరు గ్రామంలో దుర్గ మల్లేశ్వర స్వామి దేవస్థానం వద్ద సాయిబాబా మందిరం వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలకు చీరలు, దుప్పట్లను ఏపీ జెన్‌కో ఎస్ఈ బి.బాలకృష్ణ పంపిణీ చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. పొల్లూరు, మోతుగూడెం, మల్లవరం గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరైయ్యారు. కమిటీ సభ్యులు రాఘవన్, రమేష్, శ్రీను, రమణ, నాని, మల్లికార్జున, గోవిందరాజు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తీరేనా?

- రోడ్లపైనే వారపు సంతలు.. వాహన రాకపోకలకు అవస్థలు
- పెదవలసలో సంత షెడ్లు ఉన్నా ఉపయోగించని వ్యాపారులు



పెదవలసలో నిరుపయోగంగా ఉన్న సంతషెడ్లు



రహదారి పక్కనే దుకాణాలు



ఆర్వీనగర్ సంతలో ట్రాఫిక్

గూడెంకొత్తవీధి: మన్యంలోని వారపు సంతలకున్న ప్రాధాన్యత అంతా ఇంతాకాదు. గిరిజనులకు ఇవే సూపర్ మార్కెట్లు.. ఉప్పు, పప్పుతోపాటు అన్ని రకాల నిత్యావసర వస్తువులకూ గిరిజనులు కేవలం వారపు సంతలపైనే ఆధారపడతారు. గిరిజనులు పండించిన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులతో పాటు సేకరించిన అటవీ ఉత్పత్తులను వారపు సంతలకు తీసుకువచ్చి విక్రయిస్తారు. దీంతో వారపు సంతలన్నీ మన్యంలో జాతరలను తలపిస్తుంటాయి. గూడెంకొత్తవీధి మండలంలో ఆదివారం సీలేరు, దారకొండ, జర్రెల, సోమవారం ఆర్.వి.నగర్, గురువారం గూడెంకొత్తవీధి, శుక్రవారం పెదవలస, శనివారం సప్పర్లలో వారపు సంతలు జరుగుతాయి. వారపు సంతలకోసం కొన్ని చోట్ల ప్రత్యేక స్థలాలు కేటాయించినా వ్యాపారులు వాటిని సక్రమంగా వినియోగించడం లేదు. కేవలం ప్రధాన రహదారిని ఆనుకునే దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో వాహనాలు, గిరిజనులు, వ్యాపారులతో రహదారులన్నీ ఇరుకుగా మారుతున్నాయి. దీంతో పాటు వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

పెదవలసలో నాబార్డు నిధులతో షెడ్లను నిర్మించినా వ్యాపారులు అందులో దుకాణాలు వినియోగించడం లేదు. ఇక ఆర్వీనగర్, సప్పర్ల, దారకొండలో ఇదే పరిస్థితి రహదారిపైనే సంతలు జరుగుతుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పోలీసులు వారపుసంతల రోజున ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నా పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. అధికారులు ఇప్పటికైనా సమన్వయంతో వ్యవహరించి వారపు సంతల్లో ప్రత్యేకంగా దుకాణ సముదాయాలను వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు



సంతలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. దుకాణ సముదాయాల్లో ఏర్పాటు చేయాలని సూచిస్తున్నాం. రహదారిపై ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుంది. వాహనాల పార్కింగ్, దుకాణాల ఏర్పాటుపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

– అశోక్‌కుమార్, సీఐ, జీకే వీధి

జాబ్‌కార్డుదారులకు ఉపాధి పనులు



కోనలోవలో వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: జాబ్‌కార్డు ఉన్న వేతనదారులు ఉపాధి పనుల్లో పాల్గొవాలని ఎంపీడీవో కె.బాపన్నదొర అన్నారు. మండలంలోని భీముడుపాకలు, వెంకటనగరం, చేనుపాకలు, కోనలోవ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన గురువారం పరిశీలించారు. రోజు వారీగా ప్రతి వేతనదారుడికి రూ.272 వేతనం వచ్చేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. నిబంధనల మేరకు పనులు చేయాలన్నారు. పనులు జరిగే ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు తదితర సదుపాయాలు ఉండేలా చూడాలని సూపర్‌వైజర్లకు సూచించారు. సాంకేతిక సలహాదారులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



సమావేశంలో జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ బాలకృష్ణ, కుమారి

రంపచోడవరం: మండలంలోని ఊట్ల గ్రామంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కె.బాలకృష్ణ, పి.కుమారి, సొసైటీ అధ్యక్షుడు, మండల పార్టీ కన్వీనర్ రామన్నదొర పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఊట్ల సచివాలయ పరిధిలోని గత వారంలో జరిగిన గడప గడపకు కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి దృష్టికి వచ్చిన పలు సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. ఈ మేరకు భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ పొదిలి వెంకటేశ్వరరావు దృష్టికి గ్రామంలోని భూ సమస్యలను తీసుకువెళ్లారు. సొసైటీ మెంబరు బాబూరావు, మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, ధర్మరాజు, రాజారావు(కొండరాజు), సచివాలయం కన్వీనర్లు, శివ, పోతురాజు, అరుణ, వెంకటరమణ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బంగారంగరువులో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

హుకుంపేట: మండలంలోని దుర్గం పంచాయతీ బంగారంగరువు, ఓల్డా పంచాయతీల్లో నూర్పిరాయి, నిట్టపుట్టు గ్రామల్లో వరబోయిని బొంజుబాబు, రత్నమ్మ దంపతులకు చెందిన చిన్నారి, వరబోయిని చిట్టిబాబు, రత్నకుమారి దంపతులకు చెందిన చిన్నారి, సీదరి నాగేశ్వరరావు, మహేశ్వరిల చిన్నారులు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం ఆయా గ్రామాలను గురువారం సందర్శించారు. మృతి చెందిన చిన్నారుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చిన్నారుల మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు ఎటువంటి లక్షణాలు లేకుండా ఆకస్మికంగా మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు వివరించడంతో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా వైద్యాధికారులతో ఫోన్ మాట్లాడి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని కోరగా, తక్షణమే స్పందించారన్నారు. శిశు మరణాలు నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య శిబిరాలు ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. గిరిజనులకు అండగా ఉంటామన్నారు. నాయకులు బాలన్న, అప్పలరాజు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బిక్కు బిక్కుమంటూ..

శిథిలావస్థలో ఎంపీడీవో క్వార్టర్స్ భవనాలు



శిథిలదశలో ఉన్న క్వార్టర్స్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఎంపీడీవో క్వార్టర్స్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు భవనం పడిపోతుందో తెలియని పరిస్థితి. ఎన్నో ఏళ్ల కిందటి నిర్మించిన భవనాలు కావడంతో భవనాలు పూర్తిగా పాడైపోయాయి. కొన్ని భవనాలు పూర్తిగా శిథిలం కాగా, మరికొన్ని భవనాల్లో కొంత మంది ఉద్యోగులు భయం భయంగా నివసిస్తున్నారు. 1972 సంవత్సరంలో నిర్మించిన భవనాలు కావడంతో గోడలు బీటలు వారి తలుపులు, కిటికీలు పాడై దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో ఉద్యోగులు అద్దె భవనాల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఈ భవనాలు నిర్మించి 50 సంవత్సరాలు పైగా అవ్వడంతో ప్రస్తుతం నివాసించేందుకు వీలు లేకుండా పోయింది. క్వార్టర్స్‌లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగడంతో విష సర్పాలకు నిలయంగా మారాయి. కొంతమంది ఇళ్లల్లోకి అప్పుడప్పుడు విష సర్పాలు సంచరిస్తుండంతో ఆందోళన చెందుతున్నారు. శిథిలమైన భవనాలను వెంటనే కూల్చివేసి, నూతన భవనాలు నిర్మించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో రమేష్ వద్ద ప్రస్తావించగా శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

14న ఆంజనేయస్వామి జయంతికి ఏర్పాట్లు



సినిమాహాలు కూడలిలో వెలసిన పంచముఖ ఆంజనేయస్వామి

పరవాడ: స్థానిక సినిమాహాలు కూడ లిలో కొలువుదీరిన పంచముఖ ఆంజనేయస్వామి జయంతిని ఈ నెల 14న నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని శ్రీ పైడిమాంబ యూత్ కమిటీ ప్రతినిధి బొద్దపు అయ్యబాబు చెప్పారు. ఆ రోజు వేకువ జాము నుంచి స్వామికి ప్రత్యేక హోమాలు పూజలు నిర్వహిస్తారు. పరవాడ పరిసర గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసుకోవడానికి వీలు కల్పించారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆరోజు రాత్రికి ఆంజనేయ స్వామిని పుర వీధుల్లో ఊరేగిస్తారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని అయ్యబాబు చెప్పారు.

వైభవంగా మరిడిమాంబ పండగ

అనకాపల్లిటౌన్ : మండలంలోని మారేడుపూడి గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాము, సర్పంచ్ కనకరాజులు మాట్లాడుతూ వేసవి కావడంతో భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీటి, ఆలయ సమీపంలో భక్తులకు టెంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

పెదబయలు: గోమంగి మినీ గురుకుల పాఠశాల పాఠశాలలో 1వ తరగతి నుంచి 6వ తరగతి వరకు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వి.చంద్రకళాదేవి అన్నారు. 1వ తరగతికి–30 సీట్లు, 2వ తరగతికి–4 సీట్లు, 6వ తరగతికి–మూడు సీట్లు ఖాళీలున్నాయని, ఆసక్తి గల విద్యార్థులు 31 తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9492671307 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అడ్డతీగల: జాతీయ రహదారుల విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్‌లైన్లు మార్పు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో రంపచోడవరం ఈఈ ఎండీ యూసఫ్ తెలిపారు. విద్యుత్‌లైన్లతో పాటు స్తంభాల మార్పు కారణంగా అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి, గంగవరం మండలాలకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు

హుకుంపేట: మండల కేంద్రంలోని మోదకొండమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు పాంగి అనిల్ మాట్లాడుతూ అమ్మవారి జాతర మహోత్సవాలు పూర్తయిన సందర్భంగా హుండీ లెక్కింపు చేపట్టామన్నారు. అమ్మవారి ఆలయంలో హుండీ ఆదాయం రూ.29,500 వేల నగదు, రెండు వెండి శతమానాలు, రెండు కంచు ఘటాలు వచ్చినట్టు తెలిపారు. నగదు, ఇతరత్రా కానుకలను ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ, వైస్ సర్పంచ్ గోవింద్, కమిటీ సభ్యులు వెంకట్, ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆయా పోస్టులకు దరఖాస్తులు

గూడెంకొత్తవీధి: దారకొండ పంచాయతీ పరిధిలోని డి.కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీఓ లక్ష్మీదేవి చెప్పారు. స్థానికంగా స్థిర నివాసం కలిగి, పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన 22 ఏళ్ల వయసు ఉన్న గిరిజన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 17లోగా దరఖాస్తులను నేరు గా గానీ, పోస్టు ద్వారా గానీ అందజేయాలన్నారు.

చింతూరు: తుమ్మల అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో విజయగౌరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 వతేదీలోగా దరఖాస్తులను సీడీపీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

అందుబాటులో వరి విత్తనాలు

రాజవొమ్మంగి: ఎంటీయూ 1064 రకానికి చెందిన 50 టన్నుల వరి విత్తనాలు మండలానికి చేరుకున్నట్టు ఏఓ రమేష్‌నాయుడు గురువారం తెలిపారు. మొలక శాతం పరిశీలించిన తరువాత సరఫరా ప్రారంభిస్తామన్నారు. లాగరాయి ఆర్బీకేలో–17 టన్నులు, వాతంగి కొమరాపురం ఆర్బీకేలో–17 టన్నులు, మిగలిన 16 టన్నుల విత్తనాలు జడ్డంగి ఆర్బీకేలో ఉన్నట్టు చెప్పారు.

వరి విత్తనాల కోసం ఇండెంట్

మండలంలోని గిరిజన రైతుల అవసరాలకనుగుణంగా 1200 క్వింటాళ్ల వరి విత్తనాల కోసం ప్రభుత్వానికి ఇండెంట్ ప్రతిపాదించామని ఏఓ రమేష్ చెప్పారు. వీటిలో ఎంటీయూ(1064) రకం విత్తనాలు–1012.8 క్వింటాళ్లు, ఎంటీయూ(1121)– 124.7 క్వింటాళ్లు, ఎంటీయూ(1318) రకం–19.8 క్వింటాళ్లు, ఎస్ఎల్ఆర్(34449)రకం వరి విత్తనాలు– 42.7 క్వింటాళ్లు అవసరమున్నట్టు ఇండెంట్‌లో తెలియజేశామన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

గంగవరం: గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా గ్రామ పంచాయతీ సర్పంచులు కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి జడ్పిటిసి సభ్యురాలు బేబీ రత్నం పంచాయతీ కార్యదర్శులను సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా తాగునీటి సమస్యను సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై ఎంపీపీ కృష్ణారెడ్డి స్పందిస్తూ గ్రామాల్లో వేసవి సందర్భంగా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి, ఆరోగ్య, పారిశుధ్య కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మండలంలో భూ రీసర్వే 60 శాతం పూర్తయిందన్నారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. వైస్ ఎంపీపీలు కె.రామ తులసి, కె.గంగాదేవి, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు కె.ఎస్.ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీపీ అనూషాదేవి, పక్కన ఎంపీడీవో సీతయ్య, జెడ్పీటీసీ బాలయ్య



ముంచంగిపుట్టులో అవగాహన ర్యాలీలో ప్రజాప్రతినిధులు, ఫారెస్టు అధికారులు

చింతపల్లి: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందని ఎంపీపీ కోరాబు అనూషాదేవి అన్నారు. చింతపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం వరాహా కంపెనీ ఆధ్వర్యంలో అగ్రో ఫారెస్ట్రీ కార్బన్ ప్రాజెక్టు ద్వారా గిరిజన రైతులకు లబ్ధిని చేకూర్చే అంశంపై ప్రత్యేక సమావేశం జరిగింది. ప్రాజెక్టు మేనేజరు ఎం.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ ఏజెన్సీలో అడవుల విస్తీర్ణం తగ్గడంతో వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. దీంతో గిరిజనుల జీవన విధానాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. దీనికి ప్రధాన కారణం అడవుల విస్తీర్ణం తగ్గడమేనన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం గిరిజన ప్రాంతాల్లో అగ్రో ఫారెస్ట్రీని అభివృద్ధి చేయాలని సూచించారు. ఇందుకోసం గిరిజన రైతులతో అధిక ఆదాయాన్నిచ్చే పండ్ల మొక్కలు, కలప ఉత్పత్తులను ఇచ్చే మొక్కలను అభివృద్ధి చేయాలన్నారు. మొక్కల సాగును చేపట్టే రైతులకు ఆదాయాన్నిచ్చేందుకు ప్రాజెక్టులో అవకాశం ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ మీరా తదితరులు పాల్గొన్నారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాలకు చెందిన గిరిజన రైతులు హాజరయ్యారు.

ముంచంగిపుట్టు: సమాజంలో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీపీ అరిసెల సీతమ్మ అన్నారు. మండల కేంద్రంలో పర్యావరణహిత జీవన శైలి కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఫారెస్టు అధికారులు, విద్యార్థులు మండల కేంద్రంలో చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ పచ్చదనాన్ని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాలుష్యం నుంచి విముక్తి పొందాలంటే పచ్చదనాన్ని పరిరక్షించుకోవాలని, ప్లాస్టిక్ వాడకం తగ్గించాలన్నారు. వైస్ ఎంపీపీ పి. సత్యనారాయణ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ డి.చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు నారాయణపడాల్, కార్తీక్, బీట్ ఆఫీసర్లు రుక్మిణీ, శ్రీను, వెంకటపతిరాజు, నేతలు జయదేవ్, కొండలరావు తదితరుల పాల్గొన్నారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ



వంతాల సచివాలయాన్ని సందర్శించిన ఎంపీడీవో చంద్రశేఖరరావు

జి.మాడుగుల: మండలంలో పెదలోచలి, వంతాల, సొలభం ప్రాంతాల్లోని గ్రామ సచివాలయాలను ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు గురువారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని తాగునీటి ట్యాంకుల క్లీనింగ్ షెడ్యూల్ రిజిస్టర్, పాఠశాల, బడిమానివేసిన పిల్లల రిజిస్టర్లు, వ్యాక్సినేషన్, హైరిస్కు గర్భిణుల మోనటరింగ్ రిజిష్టర్లు, రక్తహీనత పిల్లల నమోదు రిజిష్టర్లు తనిఖీ చేశారు. ఈ సర్వీసెస్, ఎస్‌డీజీ సర్వే ఆధార్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. గ్రామ సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ తప్పనిసరి అని ఆదేశించారు. ఈవోపీఆర్డీ నాయుడు, సచివాల ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలి



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నేతలు

కొయ్యూరు: మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ సమష్టిగా పనిచేయాలని ఎంపీపీ బడుగు రమేష్, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జె.రాజులమ్మ, మండల సీనియర్ నాయకులు గాడి సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు, అప్పన వెంకటరమణ అన్నారు. రాజేంద్రపాలెం జిల్లా పరిషత్ అతిథి గృహంలో మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు అధ్యక్షతన గురువారం నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ మరింత బలోపేతమయ్యేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటుందన్నారు. వారి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు.పాఠశాలల నుంచి అంగన్‌వాడీ కేంద్రాల వరకు అన్నింటిని నాడు–నేడులో బాగు చేస్తున్నారన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ద్విగిజయంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. మండల కన్వీనర్ బండి సుధాకర్, ప్రచార కమిటీ అధ్యక్షుడు దోని బాబ్జీ, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, సర్పంచ్‌లు నూకరత్నం, చింతల్లి, రాజకుమారి, వెంకటలక్ష్మి, రత్నకుమారి, పెంటమ్మ, చంద్రరవు, పి.శ్రీను, ఆర్.శ్రీను, ఎంపీటీసీ సభ్యులు మల్లేశ్వరి, రత్నం, మల్లికార్జున్, మహిళా విభాగ నాయకురాలు సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాంబరేశ్వరుని ఆలయ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న భక్తులు

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో కొత్తగా నిర్మించిన కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి ర్లతోపాటు శ్రీలక్ష్మి గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ, సిద్ధయోగి విగ్రహాలను వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. అనకాపల్లి వైఎస్సార్ సీపీ పార్లమెంటు పరిశీలకుడు దాడి రత్నాకర్ ఆలయాన్ని సందర్శించి స్వామివార్లకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు రత్నాకర్‌ను దుశ్శాలువా కప్పి, జ్ఞాపికను అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వెదురువాడ సన్యాసి ఆచారి, మత్తుర్తి గంగారావు, కోటిపల్లి జేజిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేగి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.